సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం ¦ 12 ¦ ఫిబ్రవరి ¦ 2025



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టం రూ.6 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/11.1°

జిల్లా పరిధిలో మంగళవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: పిల్లల సంరక్షణను ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళాభివృద్ధి, సంక్షేమ సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12 శాఖలతో ఏర్పాటు చేసిన బాలల సంరక్షణ కమిటీ పిల్లల సంరక్షణ కోసం సంబంధిత శాఖలు బాధ్యతగా పని చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలలో కూడా పిల్లల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. బడి వయసు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలల హక్కులు, బాల్య వివాహాలపై అన్ని స్థాయిల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అనాథలు, యాచకులు, వీధి బాలల డేటాను మండలాల వారీగా సమర్పించాలన్నారు. డ్రాపౌట్ పిల్లల డేటా సేకరించాలన్నారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ జిల్లాలో పోక్సో కేసులు ఎక్కువగా నమోదైన ప్రాంతాలను గుర్తించాలని, బాల్య వివాహాల నిర్మూలనకు పోలీసు, రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డీఈఓ కృష్ణప్ప, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగ ప్రసాద్, డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, సీపీఓ విజయ్‌కుమార్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లోపాలు సరిదిద్దుకోండి

- మాతా శిశు మరణాల నియంత్రణపై డీఎంహెచ్ఓ



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి అర్బన్: తల్లీ బిడ్డలను కాపాడే క్రమంలో ఎక్కడైనా లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం సూచించారు. మాతా శిశు మరణాలకు సంబంధించి జిల్లా స్థాయి సబ్ కమిటీ సమావేశం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జనవరి నెలలో పుట్టపర్తి పీహెచ్‌సీ పరిధిలో ఒక మాతృమరణం, రొద్దం, హిందూపురం, పెద్ద మంతూరు, ధర్మవరంలో ఒకొక్కటి చొప్పున నాలుగు శిశు మరణాలు జరిగాయన్నారు. ఇకనుంచైనా ప్రతి బిడ్డనూ, తల్లినీ కాపాడుకోవాలని సూచించారు. గర్భిణులకు ప్రతి నెలా 9న జరిగే శిక్షణలో అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సునీల్, గైనకాలజిస్ట్ డాక్టర్ అస్తరున్నీసా బేగం, పీడీయాట్రీషియన్ డాక్టర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్ఓ విజయ సారథి

ప్రశాంతి నిలయం: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ విజయ సారథి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు 23,730 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. 449 కేంద్రాలను ఏర్పాటు చేసి, చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు చెప్పారు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని పోలీసు అధికారులు, లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మార్చి 17 నుంచి 31 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేయాలన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓపెన్ పరీక్షలకు 780 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో డీఈఓ కృష్ణప్ప, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్పీడీసీఎల్ ప్రతినిధి రమణారెడ్డి, లేబర్ అధికారి సూర్యనారాయణ, పోస్టల్ అధికారి విజయ సాయి కుమార్, ఆర్టీసీ డీఎం రవిచంద్ర, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం పాల్గొన్నారు.

కిక్కు మాటున టోకరా



మద్యం ప్రియుల్ని బకరాలను చేసిన బాబు

- ధరలు తగ్గిస్తున్నట్టు గతంలో చెప్పి నేడు భారీగా పెంపు
- వైన్‌షాపుల నిర్వాహకులకు 14 శాతం మార్జిన్
- వినియోగదారులపై రోజుకు రూ.65 లక్షల భారం
- ఇప్పటికే బార్‌లను తలపిస్తున్న టీడీపీ నేతల వైన్‌షాపులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మద్యం ప్రియులకు కూటమి సర్కారు ఝలక్ ఇచ్చింది. పాలన చేపట్టిన తొలినాళ్లలో మద్యం ధరలు తగ్గిస్తున్నామని, నాణ్యమైన మద్యం సరఫరా చేస్తున్నామన్న సీఎం చంద్రబాబు.. 9 నెలలు కూడా పూర్తికాకుండానే మద్యం వినియోగదారుల నడ్డి విరిచారు. ఇప్పటికే పర్మిట్ రూములు, బెల్టుషాపులతో మద్యం ఏరులై పారుతుండగా దీన్ని ఆసరాగా చేసుకుని 15 శాతం మద్యం రేట్లు పెంచారు. ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యేలు దక్కించుకున్న మద్యం షాపులన్నీ బార్‌లను తలపిస్తున్న విషయం తెలిసిందే. దీనికితోడు తమ ఎమ్మెల్యేల కోసం 10 శాతం ఉన్న మార్జిన్‌ను..

గడిచిన ఐదు మాసాల్లో ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..

మద్యం వినియోగం విలువ	రూ.581,86,73,002
మద్యం వినియోగం (లీటర్లలో)	72,30,004
బీర్ల వినియోగం (బాటిళ్లు)	2,66, 740
రోజుకు మద్యం వినియోగం విలువ	రూ.4 కోట్లు పైగా
అత్యధికంగా అనంతపురం అర్బన్‌లో	రూ.124,68,91,886

14 శాతానికి పెంచారు. మార్జిన్‌తో టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు లాభపడుతున్నారు. మద్యం ధరలు పెంచి సర్కారూ ఆదాయ వనరులు పెంచుకుంది. మధ్యలో వినియోగదారులు పూర్తిగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది.

రోజుకు రూ.65 లక్షలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరిగిన మద్యం ధరల కారణంగా రోజుకు సగటున రూ.65 లక్షల వరకూ వినియోగదారుడు నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికే రోజూ రూ.4.50 కోట్లు మద్యం వినియోగమవుతోంది. ఇందులో 15 శాతం పెరిగితే రూ.67 లక్షలు అవుతుంది. సగటున రోజూ 6 లక్షల మందిపైగా మద్యం తాగుతున్నట్టు అంచనా. ఇందులో ఎక్కువమంది మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. మరోవైపు, మద్యం షాపులు దక్కించుకున్న వారిలో 90 శాతం మంది టీడీపీ నాయకులే. వారికోసం నిన్నటిదాకా 9.5 శాతం ఉన్న మార్జిన్ మనీ 14 శాతానికి పెంచారు. దీంతో నెలకు రూ.కోట్లలో చెల్లించాల్సి వస్తుంది. మరోవైపు 15 శాతం పెంచడంతో సర్కారుకు ఉమ్మడి జిల్లా నుంచి నెలకు రూ.20 కోట్లకుపైగా అదనపు ఆదాయం సమకూరుతుంది. ఎటొచ్చీ నలుగుతోంది సామాన్యులే కావడం గమనార్హం.

యథేచ్ఛగా పర్మిట్‌రూములు, బెల్టు షాపులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 236 వరకూ మద్యం షాపులున్నాయి. గతంలో మద్యం షాపుల్లో మందు కొనుక్కునే వరకే ఉండేది. ఇప్పుడు మాత్రం కొన్నచోటే తాగేలా అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేశారు. పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు బార్‌లను తలపించేలా యథేచ్ఛగా పర్మిట్ రూములు తెరిచారు. ఇక ప్రతి గ్రామంలో బెల్టుషాపులు వేలం పాటలు నిర్వహించి మరీ పెట్టడం కూటమి సర్కారు తీరుకు అద్దం పడుతోంది. ఈ క్రమంలోనే మద్యం రేట్ల పెంపుతో సామాన్యులు సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వివిధ బ్రాండ్‌ల ధరలు ఇలా

బ్రాండ్	మోతాదు	కొత్త ధర
ఓల్డ్‌మంక్ ఎక్స్‌ట్రా	180 ఎంఎల్	రూ.130
సియాగ్రామ్స్	180	రూ.160
వ్యాట్ 69	180	రూ.590
నెపోలియన్ కొరియర్	180	రూ.240
బ్లాక్ అండ్ వైట్ విస్కీ	180	రూ.620
బ్లాక్ డాగ్ విస్కీ	180	రూ.670
999 పవర్ స్టార్	180	రూ.160

మాట తప్పిన ముఖ్యమంత్రి



కూటమి అధికారంలోకి వస్తే నాణ్యమైన, తక్కువ ధరకే మద్యం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. మద్యం ధర పెంపు ఉండబోదన్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లకే సర్కారు వంచన బట్టబయలైంది. సూపర్ సిక్స్ పథకాలంటూ మహిళలను, రైతులను, యువతను, నిరుద్యోగులను మోసం చేశారు. తాజాగా మద్యం ధరలు పెంచారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. మాట ఇచ్చి.. తర్వాత తప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తేమీ కాదు.

– బి. నరసింహప్ప, శ్రీరంగరాజుపల్లి, పరిగి మండలం

మద్యం ధరల పెంపు దారుణం



తక్కువ ధరకే మద్యం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ధరలు ఇష్టారాజ్యంగా పెంచేసి మద్యం ప్రియులను మోసం చేసింది. గెలవక ముందు ఒక మాట, గెలిచిన అనంతరం మరో మాట సరికాదు. మద్యం ధరలు పెంచడం దారుణం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మద్యం ప్రియులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కుంటి సాకులతో కాలం గడుపుతోంది. మద్యం ధరలు వెంటనే తగ్గించాలి.

– వజ్రం వెంకటేష్, పెనుకొండ

మోసం చేయడంలో దిట్ట



ఎన్నికల ముందు సరసమైన ధరలకు మద్యం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ధరలు పెంచి.. బెల్ట్ షాపులు నడిపిస్తూ దోచుకుంటున్నారు. మద్యం ధరల పెంపు అన్యాయం. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట. ఇలా నమ్మించి మోసం చేయడం ఎంతవరకు సమంజసమో వారికే తెలియాలి.

– జి.కె.ప్రకాష్, సోమందేపల్లి

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

- నకిలీ, ఒరిజినల్ నోట్లు, బైక్‌ల స్వాధీనం



ముఠా అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: నకిలీ నోట్ల చలామణి కేసులో కర్ణాటక ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ, ఒరిజినల్ నోట్లతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ రత్న కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డితో కలిసి మీడియాకు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన నలుగురు యువకులు నకిలీ నోట్ల చలామణితో సులువుగ డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకు గొర్రెల వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని పని మొదలు పెట్టారు. ఈ క్రమంలో జనవరి ఏడో తేదీన తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్ యార్డ్‌లో ఇద్దరు వ్యక్తుల వద్ద రెండు పొట్టేళ్లను రూ.30 వేలకు కొనుగోలు చేసి, రూ.500 నోట్లు 60 ఇచ్చి వెళ్లిపోయారు. అయితే ఆ నోట్లు నకిలీవని గుర్తించిన బాధితులు అదేరోజు సాయంత్రం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీం రంగంలోకి దిగింది. సీసీ టీవీ పుటేజీలు సేకరించి.. సాంకేతిక ఆధారాలు విశ్లేషించి.. నిందితులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇస్లావత్ పిరోలీనాయక్, దుంగావత్ రవినాయక్, ఎం.వి.ఆనంద్‌నాయక్, ఆదినారాయణ నాయక్‌గా గుర్తించారు. వీరిని మంగళవారం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్ వద్ద అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.30వేల నకిలీ నోట్లు, రూ.20,500 ఒరిజినల్ నోట్లతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ముఠాలో కీలక సభ్యుల కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. నిందితుల అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది విజయభాస్కర్, షాహీన, దామోదర్, కుమార్ నాయక్‌ను ఎస్పీ అభినందించి, క్యాష్ రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

కమనీయం.. కల్యాణోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత పేట వేంకటరమణుడిని ఊరేగిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో పేట వేంకటరమణస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. మంగళవారం ఉదయం నుంచి వేద పండితులు స్వామి వారికి సుప్రభాతం, తిరుమంజన సేవ, ప్రాకారోత్సవం నిర్వహించారు. పట్టణ మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు మోసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శ్రీదేవి, భూదేవి సమేత పేట వేంకటరమణుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

నేడు బ్రహ్మరథోత్సవం..

పేట వేంకటరమణుని బ్రహ్మరథోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఇందు కోసం దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. 150 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు.

రాగిరి.. విధుల్లో కిరికిరి!

- ఆ సీఐ తీరు ఆదినుంచి వివాదాస్పదమే



రాగిరి రామయ్య

మడకశిర: ఆ పోలీసు అధికారి తన ప్రవర్తన తీరుతో తరచూ వార్తల్లోకెక్కుతుంటారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు తూట్లు పొడవడం.. ఫిర్యాదుదారుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం.. సివిల్ వివాదాల్లో తలదూర్చడం.. న్యాయాన్యాయాలను పక్కనపెట్టి ఏకపక్షంగా వ్యవహరించడంతో పోలీసు శాఖలో వివాదాస్పద అధికారిగా ఘనతికెక్కారు. ఆయనెవరో కాదు మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ రాగిరి రామయ్య. గత ఏడాది డిసెంబర్‌లో ఇక్కడ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ప్రారంభం నుంచే ఆయన వ్యవహార శైలి వివాదాస్పదంగా ఉంది. అధికార టీడీపీలో ఓ వర్గానికి వత్తాసు పలికినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎల్లోటి గ్రామంలో జరిగిన ఓ ఘటనలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గానికి చెందిన మాజీ ఎంపీపీ ఆదినారాయణపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించారు. ఈ విషయం పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లింది. ఈరన్న వర్గీయులు కూడా పోలీస్ ఉన్నతాధికారులకు, పార్టీ పెద్దలకు సీఐపై ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే వారిపై కూడా దురుసుగా, అమర్యాదగా మాట్లాడుతుండడం మరింత వివాదానికి కారణమైంది. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఓ గిరిజన మహిళతో సీఐ అసభ్యకరంగా మాట్లాడారు. బాధితురాలు ఎస్పీ రత్నను నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లోని సీసీ టీవీ పుటేజీల పరిశీలనలో బాధితురాలి ఆరోపణలు నిజమని తేలింది. దీంతో సీఐ రాగిరి రామయ్యను శాఖాపరమైన చర్యల్లో భాగంగా ఈ నెల తొమ్మిదో తేదీన వీఆర్‌కు పంపారు. విచారణ నివేదిక వచ్చాక సస్పెన్షన్ వేటు వేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా గత సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు సీఐపై ఫిర్యాదులు చేశారు. ఇందులో ఓ హిజ్రా కూడా సీఐపై ఫిర్యాదు చేయడం గమనార్హం.

ముళ్ల పొదల్లో పసికందు

- గుర్తించిన వృద్ధురాలు
- అక్కున చేర్చుకున్న ముస్లిం దంపతులు



ఆర్డీటీ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న శిశువు

బత్తలపల్లి: తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు ముళ్ల పొదల్లో ప్రత్యక్షమైంది. ప్లాస్టిక్ కవర్లో చుట్టి ఉన్న పసికందును కుక్కలపాలవకుండా ఓ వృద్ధురాలు రక్షించింది. అనంతరం స్థానికంగా నివాసముంటున్న దంపతులు శిశువును అక్కున చేర్చుకున్నారు. మండల కేంద్రం బత్తలపల్లిలోని మారుతీనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బీసీ గురుకుల పాఠశాల వెనుక.. అంగన్‌వాడీ కేంద్రం పక్కన గల ముళ్ల పొదల సమీపంలో మంగళవారం ఓ వృద్ధురాలు చెత్త ఊడుస్తోంది. ఆ సమయంలో కొన్ని కుక్కలు అటుగా వచ్చి ప్లాస్టిక్ కవర్ మూటను తెరిచే ప్రయత్నం చేశాయి. వృద్ధురాలు గమనించి వాటిని తరిమి.. కవర్‌ను కదిపితే బరువుగా అనిపించింది. ఆమె స్థానికంగా ఉన్న ఓ ముస్లిం దంపతులను అక్కడకు తీసుకొచ్చింది. వారు ఆ కవర్‌ను తెరవగా మాయతో పాటు రక్తపు మరకలతో ఉన్న మగ శిశువు కనిపించింది. వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు శిశువును శుభ్రం చేశారు. బరువు తక్కువ(1.5 కిలోలు)గా ఉన్న శిశువు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో సీపీఆర్ చేసి వెంటిలేటర్ అమర్చారు. అనంతరం శిశువు దొరికిన విషయాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మకు చేరవేశారు. తమకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారని, ఈ మగ శిశువును తాము పెంచుకుంటామంటూ ముస్లిం దంపతులు ముందుకొచ్చారు.

ఈ పాపం ఎవరిది?

అప్పుడే పుట్టిన శిశువును ముళ్లపొదల్లో పడేయడంపై ప్రజలు మండి పడుతున్నారు. పెళ్లికి ముందే గర్భం దాల్చి ప్రసవమై సమాజానికి సమాధానం చెప్పలేక ఇలా వదిలించుకున్నారా.. లేక పసికందును ఎవరైనా తీసుకొచ్చి పడేశారా.. అన్నది తెలియడం లేదు. ఏది ఏమైనా కర్కశంగా ఇలా పసికందును పడేయడమేంటని శాపనార్థాలు పెడుతున్నారు. వృద్ధురాలు గమనించకపోయి ఉంటే ఊపిరాడకుండా లేదా కుక్కలపాలై శిశువు మరణించేదని పలువురు చర్చించుకోవడం కనిపించింది.

పుర పాలనపై ‘పచ్చ’ పెత్తనం



గత ఏడాదిలో చెత్త తొలగింపులు మొదలు పెట్టిన దృశ్యం (ఫైల్)



డంపింగ్‌యార్డు వద్ద ప్రస్తుతం తరగని చెత్త దిబ్బలు

- ఊ..కొడితే ఓకే. .లేదంటే బదిలీనే!
- ఇదీ హిందూపురం మున్సిపాలిటీలో ఉద్యోగుల దుస్థితి

హిందూపురం టౌన్: పుర పాలనపై అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల జోక్యం మితిమీరుతోంది. తమకు అనుకూలంగా పనిచేయని ఉద్యోగులు, అధికారులను బదిలీ పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇటీవల హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డీఈ బాలసుబ్రమణ్యం మధ్య సఖ్యత చెడింది. తాము చెప్పినట్లు చేయలేనని కినుక వహించిన డీఈని అధికార పార్టీ నాయకులు కమిషనర్‌పై వత్తిడి తెచ్చి డీఈని సరెండర్ చేయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. తననెలా సరెండర్ చేస్తారంటూ డీఈ కోర్టును ఆశ్రయించడంతో సరెండర్ ఉత్తర్వులను రద్దు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన తిరిగి విధులకు హాజరయ్యారు. అయితే తొలిరోజే లీవ్ పెట్టి వెళ్లిపోయారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకే సెలవుపై వెళ్లిపోయారనే విమర్శలు ఉన్నాయి.

సహకరించకపోతే పక్కకు తప్పుకోవాల్సిందే..

అధికార పార్టీ నాయకుల మాట వినని అధికారులెవరైనా మున్సిపాలిటీలో తప్పుకోవాల్సిందేనన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో టీపీఎస్ రెహమాన్ పెనుకొండకు బదిలీ అయ్యారు. ఇక్కడి ఏసీపీగా ఉన్న సునీల్‌రాజ్ పోస్టులేని మడకశిర మున్సిపాలిటీకి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇక ఎంఈ విశ్వనాథ్ పని ఒత్తిడి తట్టుకోలేక దీర్ఘకాలిక సెలవు పెట్టేశారు. ఇదిలా ఉండగా ‘పురం’ మున్సిపాల్టీకి బదిలీపై వచ్చిన మహిళా ఆర్‌ఓకు పదిరోజులైనా బాధ్యతలు అప్పగించ లేదు. అలాగే మరో ఇద్దరు ఆర్‌ఐలకు కూడా సరైన స్థానాలు చూపక పోవడంతో సచివాలయ అడ్మిన్లుగా పంపినట్లు విమర్శలున్నాయి.

చెత్త తొలగింపు సంగతేంటి?

మోతుకుపల్లి రోడ్డులోని డంపింగ్ యార్డులో చెత్త తొలగింపు కాంట్రాక్టును గుంటూరుకు చెందిన జాహ్నేశ్వర ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2022లో ఈ-టెండర్ ద్వారా దక్కించుకుంది. చెత్త తొలగింపునకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.4.91 కోట్లకు అగ్రిమెంట్ చేసుకుంది. ఆ ప్రకారం 61,499 మెట్రిక్ టన్నుల చెత్త మేటలు పూర్తిగా వేరు చేసి తొలగించడంతో పాటు మూడునెలల్లో ఆ ప్రాంతమంతా చదును చేసి ఖాళీ స్థలాన్ని మున్సిపాల్టీకి అప్పగించాల్సి ఉంది. కాంట్రాక్ట్ కంపెనీ గత ఏడాది సెప్టెంబర్‌లో కొంత మేర చెత్త తొలగింపు పనులు చేపట్టింది. ఈ పనులకు సంబంధించి సగం బిల్లు ఇప్పించాలని అధికార పార్టీ నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అయితే పనులు పూర్తి కాకుండా బిల్లులు చేయలేమంటూ అధికారులు స్పష్టం చేశారు. సంబంధిత ఇంజినీర్ కూడా అలాచేస్తే తాను ఇబ్బంది పడాల్సి వస్తుందని అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలోనే నాయకులతో బెడిసి ఇంజినీం బదిలీకి దారి తీసినట్లు సమాచారం.

క్లుప్తంగా

350 వక్కచెట్లు దగ్ధం

రొళ్ల: ఆకతాయిలు నిప్పు రాజేయడంతో 350 వక్క చెట్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతు తెలిపిన మేరకు... రొళ్ల మండలం దాసప్ప పాళ్యం గ్రామానికి చెందిన రైతు కరియప్ప తన కున్న మూడు ఎకరాల్లో మూడేళ్ల క్రితం 1,200 వక్క మొక్కలు నాటాడు. ఈ క్రమంలో మంగళవారం తోటకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం భోజనానికని ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో తోట పక్కనే ఉన్న గట్టుకు ఉన్న ఎండుగడ్డికి ఆకతాయిలు నిప్పు రాజేయడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి తోటను చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న కరియప్ప అక్కడకు చేరుకుని చుట్టుపక్కల రైతుల సాయంతో మంటలు ఆర్పాడు. దాదాపు రెండు గంటల పాటు చెలరేగిన మంటల్లో 350 వక్క చెట్లు, 30 కొబ్బరి చెట్లు కాలిపోయాయి. దీంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. తాము వైఎస్సార్‌సీపీకి మద్దతుదారులుగా ఉంటున్నామని కక్ష గట్టి గత ఎన్నికల సమయంలో 20 వక్కచెట్లను నరికి వేశారని గుర్తు చేశాడు. తాజా ఘటన కూడా కావాలనే ఎవరో చేశారని అనుమానాలు వ్యక్తం చేశాడు.

సబ్ జైలులో ఖైదీ మృతిపై నేడు విచారణ

హిందూపురం టౌన్: స్థానిక సబ్ జైలులో ఖైదీ కదిరిప్ప మృతి చెందిన అంశంపై బుధవారం విచారణ చేపట్టనున్నారు. లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులు టి.కొత్తపల్లికి కదిరప్ప నిందితుడు కాగా, అప్పట్లో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే అనారోగ్యంతో బాధపడుతూ గన ఏడాది నవంబర్, 27వ తేదీన ఆయన మృతి చెందాడు. దీనిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అంశంపై కలెక్టర్ ఆదేశాల మేరకు పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ బుధవారం హిందూపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ వెంకటేసు మంగళవారం వెల్లడించారు. మృతుడి గురించి తెలిసిన వారు అఫిడవిట్ రూపంలో లేదా ప్రత్యక్షంగా వచ్చి వివరాలు అందజేయాలని కోరారు.

నిరీక్షించి.. నీరసించి

పెనుకొండ రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి చేపట్టిన ఇంటర్వ్యూలు ఓ ప్రహసనంగా మారాయి. పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 27 కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాల కోసం 55 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేపట్టారు. ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు కాగా, అభ్యర్థులు అరగంట ముందే కార్యాయానికి చేరుకున్నారు. ఇందులో పసిపిల్లలూ ఉన్నారు. అయితే ఇంటర్వ్యూల కోసం వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి సౌకర్యాలను అధికారులు కల్పించలేదు. అరకొరగా తాగునీటి క్యాన్‌లను ఉంచారు. ఈ నీరు కాస్త అయిపోవడంతో తాగునీటి కోసం నానా ఇబ్బంది పడ్డారు. చివరకు రూ.20 వెచ్చించి బయట బాటిళ్లు కొనుగోలు చేసి దాహం తీర్చుకున్నారు. కనీసం కుర్చీలు కూడా వేయకపోవడంతో కటిక నేలపైనే గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ సుధా వరలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి అక్కడకు చేరుకుని ఇంటర్వ్యూలు చేపట్టారు. కాగా, డివిజన్ వ్యాప్తంగా 46 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.


ఆర్డీఓ కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న అభ్యర్థులు


చెట్ల కింద నిరీక్షిస్తున్న మహిళలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు


తల్లి ఇంటర్వ్యూకు హాజరవడంతో ఆవరణలో చిన్నారి ఇలా...

ఏపీ అమరావతి జేఏసీ మహిళా విభాగం జిల్లా కమిటీ ఎంపిక

హిందూపురం టౌన్: ఏపీ అమరావతి జేఏసీ మహిళా విభాగం జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి డివిజన్ స్థాయి మహిళా ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ అమరావతి జేఏసీ మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా చైర్మన్, ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా జనరల్ సెక్రెటరీ మైనుద్దీన్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు దివాకర్ రావు, లేపాక్షి, పరిగి తహసీల్దార్‌లు సౌజన్యలక్ష్మి, హసీనా సుల్తానా తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పెనుకొండ డివిజన్ చైర్‌పర్సన్‌గా హిందూపురంలోని ముదిరెడ్డిపల్లిలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఎడిత్ రోజ్, ప్రధాన కార్యదర్శిగా మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్న రమాదేవి, చైర్‌పర్సన్‌లుగా వీఆర్‌ఓలు గీతాంజలి, సుభాషిణి, కార్యదర్శులుగా బేబీ, కవిత, సుమిత్ర, ట్రెజరర్‌గా చంద్రను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులను నమోదు చేయడానికి, పర్యవేక్షించడానికి ఒక కేంద్రీకృత వేదిక అయినా షీ-బాక్స్ పోర్టల్‌ను తొలుత కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇదే తరహాలో రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో షీ-బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా శిశు సంరక్షణ కోసం మహిళలకు రెండేళ్ల కాలానికి సెలవులను పెంచాలన్నారు. ఐఆర్‌తో పాటు పీఆర్సీ కమిటీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.


ఎన్నికైన పెనుకొండ డివిజన్ మహిళా విభాగం కమిటీ

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ పోలీసులకు స్థానిక బోయవీధికి చెందిన వివాహిత ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. బోయవీధికి చెందిన కంసల హిమబిందు, వంశీకృష్ణ దంపతులు. మరిది కేశవచారితో కలసి వ్యసనాలకు బానిసైన భర్త తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై విచారణ అనంతరం భర్త, మరిదిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సచివాలయ ఉద్యోగికి బెదిరింపులు

ధర్మవరం రూరల్: పోతుకుంట సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌పై అదే గ్రామానికి చెందిన బీజేపీ నేత జయరాం మంగళవారం సాయంత్రం తీవ్ర పదజాలంతో దూషిస్తూ బెదిరిపులకు పాల్పడ్డాడు. తాను చెప్పిన వారికి పనులు చేయలేదనే కక్షతో డిజిటల్ అసిస్టెంట్ జనార్దన్‌నాయుడుపై నోటికొచ్చినట్లు పత్రికల్లో రాయలేని బూతులు తిట్టాడు. ఒకానొక దశలో వేలు చూపుతూ జాగ్రత్తగా ఉండు అంటూ బెదిరించాడు. విషయం తెలుసుకున్న సచివాలయ ఉద్యోగులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయనున్నట్లు డిజిటల్ అసిస్టెంట్ తెలిపాడు. కాగా ఉద్యోగిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు.

కొరియర్ సంస్థ నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు

ధర్మవరం అర్బన్: ఎక్సవేటర్లు కొనుగోలు చేసి డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన కొరియర్ సంస్థ నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ధర్మవరానికి చెందిన బొమ్మనేని రవీంద్ర.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గరుడా ఇన్‌ఫ్రా కంపెనీ నడుపుతూ ఎర్త్ మూవర్స్ అండ్ ట్రావెలింగ్ వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పూణేకు చెందిన ఫాస్ట్ ఎయిర్ కొరియర్ సర్వీస్ సంస్థ నిర్వాహకులు కొన్ని రోజుల క్రితం రెండు కోబెల్‌కో ఎక్సవేటర్ మిషన్లను రూ.2.10 కోట్లతో కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా రూ.30 లక్షలు అడ్వాన్స్ కింద చెల్లించి, మిగిలిన డబ్బును తర్వాత చెల్లిస్తామంటూ నమ్మబలికి రెండు ఎక్సవేటర్లను తీసుకెళ్లారు. అనంతరం బకాయిలు చెల్లించకుండా మిన్నకుండి పోవడంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పూణేకు చెందిన కొరియర్ సంస్థ నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అడ్డుగా ఉన్నాడని... అంతం చేసింది

- దేవరకొండ కాశప్ప హత్య కేసులో వీడిన మిస్టరీ
- హతుడి భార్యతో పాటు మరో ఇద్దరి అరెస్ట్

రాప్తాడు రూరల్: ఇటీవల అనంతపురం నగర శివారున 44వ జాతీయ రహదారి పక్కన చింతతోపులో జరిగిన దేవరకొండ కాశప్ప హత్య కేసులో మిస్టరీని అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. ప్రియుడిపై మోజుతో కట్టుకున్న భార్యనే కాశప్పను హతమార్చినట్లుగా నిర్ధారణ కావడంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శేఖర్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ కాశప్ప అలియాస్ కాశి, సౌభాగ్య దంపతులు. అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి టమాట మండీలో కూలీలను ఏర్పాటు చేసే మేస్త్రీ పనితో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కాశప్ప రెండు నెలల క్రితం చీరల వ్యాపారం కోసమని హైదరాబాద్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి టమాట మండీలో కూలీలతో సౌభాగ్య పనులు చేయిస్తూ వచ్చింది. ఆమె పర్యవేక్షణలో కర్ణాటకలోని కోలార్ ప్రాంతానికి చెందిన నవాజ్ బేగ్, గౌస్ పీర్ పనికి కుదిరారు. ఈ పరిచయం కాస్త సౌభాగ్య, నవాజ్ బేగ్ మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం టమాట మండీలో అందరితో పాటు భర్తకూ తెలిసి పోయింది. దీంతో ఆయన భార్యను తీవ్ర స్థాయిలో మందలించాడు. అయితే తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డు చెప్పడాన్ని సౌభాగ్య జీర్ణించుకోలేకపోయింది. ఎలాగైనా కాశప్పను హతమార్చి ఇద్దరూ కలసి జీవించాలనుకున్నారు. ఈ క్రమంలో పథకం ప్రకారం నవాజ్, గౌస్ ఇద్దరూ కాశప్పను పార్టీ చేసుకుందామని ఈ నెల 2న చింత తోపులోకి పిలుచుకెళ్లారు. అక్కడ కాశప్పతో ఫుల్‌గా మద్యం తాగించిన అనంతరం బీరు బాటిళ్లు, రాళ్లతో దాడి చేసి హతమార్చారు. అదే రోజు సాయంత్రం అటుగా వెళ్లిన స్థానికుల సమాచారంతో అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సౌభాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సౌభాగ్య ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో మంగళవారం ఆర్డీటీ స్టేడియం వద్ద తచ్చాడుతున్న సౌభాగ్య, నవాజ్‌బేగ్, గౌస్‌పీర్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి హతుడి పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన రెండు బండరాళ్లు, రక్తం మరకలు అంటిన టీషర్టులు స్వాధీనం చేసుకున్నారు.


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శేఖర్

రిమాండ్‌కు పలువురు

సోమందేపల్లి: వివాహిత అనుమానాస్పద మృతి కేసులో అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలు... ఈ నెల 7న సోమందేపల్లి మండలం కేతగాని చెరువు గ్రామంలో వివాహిత హిమజ (26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం రాత్రి మృతురాలి భర్త ఆదర్శ్, అత్త శ్యామల, మరిది సతీష్‌ను ఎస్‌ఐ రమేష్‌బాబు అరెస్ట్ చేసి, మంగళవారం ఉదయం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అధినేతతో గోరంట్ల మాధవ్ భేటీ


వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాధవ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయనకు వైఎస్ జగన్ సూచించారు.

పెరిగిన ఎండు మిర్చి ధరలు


మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండు మిర్చి ధరలు పెరిగాయి. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 94 క్వింటాళ్ల ఎండు మిర్చి వచ్చింది. ఈ- నామ్ ద్వారా వేలం వేయగా .. మొదటి రకం క్వింటాలు రూ.17వేలు, రెండో రకం రూ.13,500, మూడో రకం రూ.7వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

మందుబాబుల ఆకతాయి చేష్టలు


మంటలు ఆర్పుతున్న దృశ్యం

గోరంట్ల: మందుబాబుల ఆకతాయి చేష్టలకు రైతులు సాగు చేసిన పంట పొలాలు దగ్ధమయ్యాయి. వివరాలు.. గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన రైతు కమ్మ వెంకటప్ప తనకున్న మూడు ఎకరాల్లో ఉలవ సాగు చేశాడు. ఆ పొలానికి పక్కనే రైతు చాకలి హేమద్రి తనకున్న రెండు ఎకరాల్లో కందిపంట, రైతు చాకలి లక్ష్మీనారాయణ తనకున్న రెండు ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆ పంట పొలాలకు సమీపంలో కొందరు తాగుబోతులు మద్యం సేవించి, మత్తులో సిగరెట్, బీడీ అంటించుకున్న అనంతరం అగ్గిపుల్లను ఆర్పకుండా పంటపై వేయడంతో నిప్పు రాజుకుని మంటలు ఎగిసిపడ్డాయి. ఘటనలో కంది, ఉలవ పంటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒకరు, అనారోగ్య పరిస్థితులను తట్టుకోలేక మరో ఇద్దరు, ఒంటరి జీవితాన్ని తాళలేక ఇంకొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలు...

ముదిగుబ్బ: మండలంలోని ఎస్.బ్రాహ్మణపల్లికి చెందిన వివాహిత కళ్యాణి(35) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఇటీవల కుమారుడికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె సోమవారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు ముదిగుబ్బ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


కళ్యాణి (ఫైల్)

ధర్మవరం రూరల్: మండలంలోని ఓబుళనాయనపల్లి తండాకు చెందిన నారాయణస్వామి కుమారుడు లావడియా శ్రీధర్ నాయక్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. సెంట్రింగ్ పనులతో జీవనం సాగిస్తున్న ఆయన ఒప్పందంలో భాగంగా ఓ మేస్త్రీ వద్ద రూ.2.50 లక్షలను అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అయితే పనులకు వెళ్లలేక పోయాడు. ఈ క్రమంలో అడ్వాన్స్ తిరిగి చెల్లించలేక సతమతమవుతూ మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న హరినాయక్ ఫిర్యాదు మేరకు ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తనకల్లు: ఒంటరి జీవితాన్ని తాళలేక తనకల్లు మండలం బొంతలపల్లికి చెందిన గంగాద్రి (23) బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన శాంతమ్మకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు గంగాద్రికి నాలుగేళ్ల క్రితం కర్ణాటకలోని శాంతిపురం గ్రామానికి చెందిన రక్షితతో వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. కుటుంబకలహాల నేపథ్యంలో రెండేళ్ల క్రితం కుమారుడిని పిలుచుకుని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు కాపురానికి రావాలని భర్త పిలిచినా ఆమె వినలేదు. దీంతో మనోవేదనకు లోనైన గంగాద్రి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

గోరంట్ల: స్థానిక ఎండాలబండ వీధికి చెందిన బలిజ శ్రీనివాసులు (30) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆయన బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి మూత్ర విసర్జన రాక ఇబ్బంది పడిన ఆయన.. నొప్పి తీవ్రత తాళలేక టీటీడీ కల్యాణమంటపం వద్ద ఉన్న తమ పశువుల షెడ్డు సమీపంలో కానుగ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రారండోయ్... రథోత్సవం చూద్దాం


కొండపై ఏర్పాటు చేసిన బారికేడ్లు



దేవర కొండపై వెలిసిన కొండ మీద రాయుడు, ముస్తాబైన తేరు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో బుధవారం కొండ మీదరాయుని రథోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. ఇప్పటికే ఆలయ కమిటీ, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం తెల్లవారుజాము 4 గంటలకు శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 11 గంటలకు శ్రీవారిని సతీసమేతంగా సూర్య ప్రభ వాహనంపై పుర వీధుల్లో ఊరేగిస్తారు. మధ్యాహ్నం స్వామి వారి రథోత్సవం ఉంటుంది.

ప్రత్యేక ఏర్పాట్లు..

రథోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. తేరును సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. దేవర కొండపై కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండ మీదకు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు సిద్ధంగా ఉంచారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట, మార్కండేయస్వామి ఆలయం ఎదుట అన్నదాన నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవం సందర్భంగా బీకేఎస్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దేవర కొండపైకి ప్రవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదని సీఐ తెలిపారు. చోరీలకు, ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ పర్యవేక్షణలో ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 20 మంది ఏఎస్‌ఐలు, 50 మంది పోలీసు, 50 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది బందోబస్తుకు కేటాయించినట్లు వెల్లడించారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఘరానా మోసం

- అప్పు చెల్లించినా.. ప్లాట్ తిరిగివ్వని వైనం
- న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు

పుట్టపర్తి టౌన్: ఏఆర్ కానిస్టేబుల్ వలి ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. తనకు న్యాయం చేయాలని అనంతపురానికి చెందిన బాధితుడు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీని కలిసి కన్నీటి పర్యంతమయ్యాడు. వలి గతంలో అనంతపురంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. అప్పట్లో స్థానిక వెంకటనారాయణ అనే వ్యక్తి అవసరాల నిమిత్తం వలితో రూ.6లక్షలు అప్పు తీసుకున్నాడు. ష్యూరిటీ కింద అనంతపురం సమీపంలోని ఉప్పరపల్లి గ్రామ రెవెన్యూ పొలం 216-5 సర్వే నంబర్‌లో గల ఐదు సెంట్ల ప్లాట్‌ను ఆయకపు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొద్ది రోజుల క్రితం వెంకటనారాయణ అసలు-వడ్డీ చెల్లించి ప్లాట్‌ను తిరిగి తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడు. అయితే ఆ స్థలంతో మీకు సంబంధం లేదంటూ వలి ఎదురుతిరిగాడు. మనో వేదనకు గురైన వెంకటనారాయణ కుమారుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా కానిస్టేబుల్‌కు కనికరం కలగలేదు. ఆ ప్లాట్‌ను ఇతరులకు దర్జాగా అమ్మి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇప్పుడు తనకు కూడా ఆరోగ్యం సరిగా లేదని, వయసు మీద పడిందని, అండగా ఉండాల్సిన కుమారుడినీ కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని వెంకటనారాయణ మంగళవారం సాయంత్రం ఎస్పీ రత్నను కలిసి వేడుకున్నాడు. స్పందించిన ఎస్పీ.. రెండు రోజుల్లో విచారణ చేయించి.. న్యాం చేయాలని ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులును ఆదేశించారు.


వృద్ధునితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న